క్లుప్తంగా

కూటమి ఎన్నికల ప్రచారంలో జీఎంసీ ఉద్యోగి



నెహ్రూనగర్: ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొనకూడదని స్పష్టమైన ఆదేశాలున్నాయి. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాలు జారీ చేసినప్పటికీ నగరపాలక సంస్థ ఉద్యోగులు బేఖాతర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇద్దరు ఉద్యోగులు కూటమి ప్రచారంలో పాల్గొనగా, వారిపై చర్యలకు ఉపక్రమించారు. అయినప్పటికీ నగర పాలక సంస్థ ఔట్ సోర్సింగ్(అప్కాస్) పద్ధతిలో వెహికల్ షెడ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎన్. రమణ తూర్పు టీడీపీ ఇన్‌చార్జ్ నసీర్ అహ్మద్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: పలు చోరీ కేసుల్లో నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన కోనూరి శ్రీనివాసరావు గతంలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ దొంగ బంగారం విక్రయించి పెట్టడంతో ఓ వ్యక్తికి సహాయపడి అరెస్టు అయి జైలుకు వెళ్లాడు. 2023 సెప్టెంబరులో మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో, అదే నెలలో గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో, 2024 మార్చిలో పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో చోరీలు చేశాడు. అదే నెలలో పొన్నూరు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు చోరీలు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం నిందితుడు శ్రీనివాసరావును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ద్విచక్రవాహనం, 39 గ్రాముల బంగారు, 353 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు.

శిశువు విహార్‌కు అనాథ శిశువు తరలింపు

ఆరు నెలలు ఆలనా పాలన చూసిన జీజీహెచ్ వైద్యులు



గుంటూరు మెడికల్: జీజీహెచ్ పిల్లల వైద్య విభాగంలో వైద్యులు, సిబ్బంది అనాథగా ఆసుపత్రికి తీసుకొచ్చిన పసికందుకు ఆరునెలల పాటు అన్నీ తామై ఆలనాపాలన చూశారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో బుధవారం శిశు విహార్‌కు తరలించారు. బాపట్లలో గత ఏడాది సెప్టెంబరులో ఓ ఆడ శిశువును బ్రిడ్జి కింద వదిలి వెళ్లడంతో ఐసీడీఎస్ సిబ్బంది తొలుత అక్కడి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. బరువు తక్కువగా ఉండటంతో సెప్టెంబరు 7న గుంటూరు జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. పిల్లల వైద్య విభాగం వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. బిడ్డకు కావాల్సిన పాలు, దుస్తులన్నీ తమ వేతనాల నుంచి కొనుగోలు చేసి, కంటికి రెప్పలా సాకారు. పూర్తి ఆరోగ్యంగా ఉండటంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సదరు శిశువును ఐసీడీఎస్ సిబ్బందికి అందించి, శిశువిహార్‌కు తరలించేలా చేశారు. అనాథ శిశువులను సొంత బిడ్డలా చూసుకుంటున్న పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ పద్మలత, పిల్లల వైద్యులు, సిబ్బందిని డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు.

పాలిసెట్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



గుంటూరు రూరల్: పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా టెక్నికల్ విద్యను త్వరితగతిన పూర్తి చేసుకుని త్వరగా ఉపాధిని పొందేందుకు అవకాశాలుంటాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన పాలిసెట్-2024 ఉచిత శిక్షణా శిబిరాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉన్నతమైన విద్యను అందించి వారి ఉన్నతికి కృషిచేయటం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న 150 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాలిటెక్నిక్ కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా విద్యార్థులకు లభించే అవకాశాలు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్స్ కె.రమణబాబు, జానకీరామ్, కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టంలో ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా !



రైతుబజారులో వ్యాపారులను పలుకరిస్తున్న మంత్రి విడదల రజిని



గుంటూరు ఏటీ అగ్రహారంలోని వృద్ధాశ్రమంలో ఓ వృద్ధురాలికి జడ వేస్తున్న మంత్రి రజిని

- రైతుబజారులో మంత్రి రజిని పర్యటన
- ప్రతి ఒక్కరికీ ఆత్మీయ పలుకరింపు
- సమస్యల పరిష్కారానికి హామీ

పట్నంబజారు: అన్నా.. ఎలా ఉన్నారు.. నేను మీ రజినమ్మను.. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అక్కా... బాగున్నారా.. ఏవైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకు రండి.. కష్టంలో.. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా.. ఇబ్బందులు ఉంటే అడ్డుగోడలా నిలబడతా.. సమస్యల పరిష్కారానికి 24 గంటలూ మీకు అందుబాటులో ఉంటా.. అని మంత్రి విడదల రజిని ఆప్యాయంగా వ్యాపారుల్ని పలకరించారు. ఆమె బుధవారం బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లోని రైతు బజారుకు ఉదయాన్నే వెళ్లారు. వ్యాపారుల్ని ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయో వారినే నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆకుకూరలు అమ్ముతున్న ఒక బామ్మను ఆప్యాయంగా పలకరించారు. వృద్ధాప్య పింఛను అందుతుందా ? అని వాకబు చేశారు. కూరగాయలు కొనడానికి వచ్చిన పలువురు వినియోగదారులను కూడా పలకరించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిరువ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. రైతాంగానికి కష్టం రాకుండా పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. పంట రుణాలు అందజేయంతోపాటు, గిట్టుబాటు ధరలు కల్పించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని తెలిపారు. ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతుల పంటలను కొనుగోలు చేయడంతోపాటు, నాణ్యమైన విత్తనాలు సబ్సిడీ ధరలకు అందజేశారని వివరించారు. ఎరువులు, పురుగు మందులు అందజేశారని వెల్లడించారు. అనంతరం రైతు బజారులోని పలు సమస్యల్ని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రజిని హామీ ఇచ్చారు.

జగనన్నతోనే భరోసా

- మంచి చేసే నాయకుడికి అండగా ఉండండి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ సీనియర్ నాయకుడు దొడ్డపనేని రాజేంద్రకుమార్‌తో భేటి

పట్నంబజారు: ఆంధ్రప్రదేశ్‌కు, ప్రజల జీవితాలకు జగనన్నతోనే భరోసా దక్కుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, పాత 35 డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షుడు దొడ్డపనేని రాజేంద్రకుమార్ నివాసానికి బుధవారం మంత్రి విడదల రజిని వెళ్లారు. జగనన్న పేదల కోసం ఎంతో మంచి చేస్తున్నారని, ఆయనకు అండగా ఉండాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని, తనకు మద్దతుగా నిలవాలని కోరారు. అందుకు రాజేంద్రకుమార్ సానుకూలంగా స్పందించారు. తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.



దొడ్డపనేని రాజేంద్రకుమార్ కుటుంబ సభ్యులతో మంత్రి విడదల రజిని

చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇన్నోవేషన్ ఫెయిర్-2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సృజనాత్మక ఆలోచనలు కచ్చితంగా ఉంటాయని, వాటిని వెలుగులోకి తీసుకురావడంలో ఇటువంటి సాంకేతిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి పరచి, నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించడంలో కళాశాలల యాజమాన్యాలు కృషి చేయాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు వివరణాత్మక, విశ్లేషణ సామర్థ్యం ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ ఫెయిర్‌లో భాగంగా ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కన్వీనర్ ఎస్. కృష్ణార్జునరావు, కో-కన్వీనర్లు ఐ. నాగాంజనేయులు, కె. సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త నాగేశ్వరరావుకు సత్కారం

సరుకు రవాణాలో గుంటూరు డివిజన్ రికార్డు

డీఓఎం దినేష్‌కుమార్‌ను అభినందించిన డీఆర్ఎం



లక్ష్మీపురం: సరుకు రవాణాలో గుంటూరు డివిజన్ రికార్డు సాధించడం అభినందనీయమని డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. గుంటూరు రైల్వే డివిజన్ 3.364 మిలియన్ టన్నుల రవాణాతో ఆల్‌టైమ్ రికార్డును సొంతం చేసుకుందని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2.793 మిలియన్ టన్నుల వరకు రవాణా చేయగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 3.364 మిలియన్ టన్నులు చేసి లక్ష్యాలను అధిగమించిందని చెప్పారు. డివిజన్ సంబంధిత అధికారులు, కార్మికులను సమన్వయం చేసుకుంటూ ఎలాంటి లోపాలకు తావులేకుండా పక్కా ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలు సాధించామని వివరించారు. ఈ రికార్డుతో డివిజన్‌లోని దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఏ డివిజన్‌లో లేని విధంగా రూ 395.8 కోట్ల గణనీయమైన ఆదాయం సాధించినట్లు వెల్లడించారు. దీని వెనుక ఉద్యోగుల సమష్టి కృషి ఎంతో ఉందని తెలిపారు. ప్రధానంగా వివిధ వ్యాపార సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి తక్కువ సమయంలో సరుకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం డివిజన్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన సీనియర్ డీఓఎం ఎం.దినేష్‌కుమార్‌ను, సంబంధిత విభాగాధికారులను డీఆర్ఎం రామకృష్ణ ప్రశంసించారు.

ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: సమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం ఓటు హక్కు వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులుకు కల్పించిన హక్కుల్లో ఓటుహక్కు ప్రముఖమైందని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకోవడంలో యువత ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. కళాశాల రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు పి. కుమార్ రాజా మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత ఓటు ఎంతో కీలకమని తెలిపారు. ఓటు వేయడంతో పాటు చుట్టూ ఉన్నవారిని వేసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్

అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వాహణ అధికారి జేవీ సుధీర్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్. జయ శైలజ, లక్ష్మీదీప్తి, చంద్రశేఖర్, వేణు, వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ సహ ప్రముఖ్‌గా 'జంధ్యాల'



గుంటూరు ఈస్ట్: ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో భాగంగా భారతీయ జనతాపార్టీ విశేష సంపర్క్ అభియాన్ రాష్ట్ర సహ ప్రముఖ్‌గా జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, రాజంపేట పార్లమెంట్‌లకు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారన్నారు.

ఏఐతో సాంకేతిక రంగంలో సమూల మార్పులు



సావనీర్ విడుదల చేస్తున్న గంగాధరరావు, శ్రీనివాస్, మురళీమోహన్, నాగేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో భవిష్యత్తులో సాంకేతిక రంగంలో సమూల మార్పులు చోటు చేసుకోనున్నాయని ఏఎన్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో ''కంప్యూటర్ సైన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్'' అనే అంశంపై బుధవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ఎడ్జ్ కంప్యూటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా శాస్త్ర, సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని చెప్పారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంలో అందుబాటులో ఉన్న చాట్ జీపీటీ తదితర అంశాల గురించి వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్ గురించి విస్తృతమైన సమాచారాన్ని అందించేందుకు సదస్సు దోహదం చేస్తుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరగనున్న సదస్సులో భాగంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీ మోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, సదస్సు కన్వీనర్ డాక్టర్ వై.సురేష్‌బాబు, కో-కన్వీనర్ వై. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలపతి' విద్యార్థుల రక్తదానం



గుంటూరు రూరల్: అన్నిదానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్న ఇద్దరి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాలలోని విద్యార్థులు 100 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధినేత వైవీ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు.

ఏఎన్‌యూలో త్వరలో రోబోటిక్స్ క్లబ్



రోబోట్ కదలికలను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ: రోబోటిక్స్ రంగానికి అధిక ప్రాధాన్యత వస్తున్న ప్రస్తుత తరుణంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో క్లబ్‌ను ప్రారంభించనున్నామని వీసీ ఆచార్య రాజశేఖర్ తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ ప్రసంగిస్తూ ఆధునిక సాంకేతిక ప్రపంచంలో రోబోటిక్స్ రంగానికి అధిక ప్రాధాన్యత ఉందని, ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయంలో రోబోటిక్స్ కోర్స్ ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇంజినీరింగ్ డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రోబోటిక్స్ క్లబ్ లోగో ఆవిష్కరణతో పాటు రెండు రోజులపాటు విద్యార్థులకు ఆ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కంపు పాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ నారంగ్ వివిధ రకాల రోబోట్లను ప్రదర్శించి వాటిని రూపొందించే అంశాలు, ప్రాధాన్యతను తెలియజేశారు. రోబోటిక్ రంగ నిపుణులు సుదర్శన్ జయబాలని పరిశ్రమలలో ఉపయోగించే రోబోట్‌లపై అవగాహన కల్పించారు. కార్యశాలలో ప్రయోగాత్మకంగా నిర్వహించే ప్రతి అంశాన్ని విద్యార్థులు క్షుణ్ణంగా నేర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్ధయ్య సూచించారు. ఇటువంటి కార్యశాలలు కళాశాలను మరో మెట్టుకు తీసుకెళతాయని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గంగాధరరావు తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగ విద్యార్థులు మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వంటి అంశాలలో వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. విభాగాధిపతి బాలాజీ, అధ్యాపకులు సతీష్ కుమార్, చైతన్య పాల్గొన్నారు.

ఉద్యోగులంతా కుటుంబ సభ్యులే ..



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ కుటుంబ సభ్యులేనని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆధునీకరించిన రెవెన్యూ భవన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులంతా కలిసిమెలిసి పనిచేస్తే ఎటువంటి పొరపచ్చాలు ఉండవని సూచించారు. సమన్వయంతో పనిచేస్తూ ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ఆధునీకరించిన భవన సముదాయాన్ని కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో పెద్ది రోజా, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కె.రమేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పరిశీలించారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

ప్రత్తిపాడు: తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు వలంటీర్ల వ్యవస్థను హేళన చేస్తూ, నీచాతి నీచంగా మాట్లాడుతున్నారు. మరో పక్క ఆ పార్టీల నేతలు ఎన్నికల కోడ్ పేరుతో మమ్మల్ని వెంటాడుతూ, వేధింపులకు గురి చేస్తున్నారు. చివరికి బంధువుల ఇంటికి వెళ్లినా.. తోబుట్టువులతో మాట్లాడినా.. ఫొటోలు తీస్తూ మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు. అందుకే ఈ వేధింపులు తట్టుకోలేక మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నాం. ఇదీ ప్రత్తిపాడులో వలంటీర్ల ఆవేదన.. టీడీపీ, జనసేన నాయకుల వేధింపులు తట్టుకోలేక నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. మొత్తం ప్రత్తిపాడు పంచాయతీలో 65 మంది వలంటీర్లు ఉండగా, వారిలో అందుబాటులో ఉన్న 53 మంది స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్‌ను కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. రాజీనామాలకుగల కారణాలు ఏమిటని ఎంపీడీఓ వారిని ప్రశ్నించారు. గడిచిన ఐదేళ్లుగా కులమతాలు, పార్టీలు, వర్గాలు చూడకుండా నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేశామని, కానీ నేడు మా పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తూ, టీడీపీ, జనసేన నాయకులు హీనంగా మాట్లాడుతున్నారన్నారు. అంతేకాకుండా పింఛన్లకు సేవ చేయలేనప్పుడు మాకు ఈ ఉద్యోగం ఉన్నా ఒక్కటే లేకున్నా ఒక్కటేనని, బంధువులు, తోబుట్టువుల ఇళ్లకు కూడా వెళ్లలేకపోతున్నామని అందుకే రాజీనామాలు చేస్తున్నామని వలంటీరుల ఎంపీడీఓకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన పంచాయతీ సెక్రటరీకి రాజీనామా పత్రాలు అందజేయాలని కోరారు. దీంతో వారు ప్రత్తిపాడు సెక్రటరీ జాన్‌పీరాకు రాజీనామా పత్రాలను అందజేశారు. ఆయన ఎంపీడీఓకు నివేదిక రూపంలో ఆమోదం కోసం పంపనున్నట్లు తెలిపారు.



ప్రత్తిపాడులో ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

వట్టిచెరుకూరు మండలంలో ...

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలంలోని రెండు గ్రామాల్లో వలంటీర్లు స్వచ్ఛందంగా మూకుమ్మడి రాజీనామాలు చేశారు. మండల పరిధిలోని గారపాడు సచివాలయంలో వలంటీర్లుగా సేవలందిస్తున్న 16 మంది, కుర్నూతల గ్రామ సచివాలయంలో వలంటీర్లుగా చేస్తున్న ఎనిమిది మందిలో ఏడుగురు వలంటీర్లు రాజీనామా చేయగా, మరో వలంటీరు నేడు రాజీనామా చెయ్యనున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

గుంటూరు రూరల్: లింగ వివక్షత విడనాడి, పురుషులతో పాటుగా మహిళలకు కూడా సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే దేశప్రగతిలో పురోగతి సాధించుకోవచ్చని హైకోర్ట్ న్యాయవాది నర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెక్సువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ (ప్రివెన్షన్, ప్రొహిబిషన్, అండ్ రిడ్రెస్సల్) యాక్ట్, 2013 అనేఅంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను తెలియజేశారు. భారత రాజ్యాంగ నిర్మాణం మొదలు నేటి వరకు స్త్రీల రక్షణ కోసం తీసుకొచ్చిన వివిధ చట్టాల గురించి వివరించారు. దేశ పాలనలో అగ్ర పీఠమైన ప్రధానమంత్రి, రాష్ట్రపతి వంటి పదవీ బాధ్యతల్లో తమ శక్తిని నిరూపించుకుంటూ, ఇస్రో, అంతరిక్ష పరిశోధనలతో పాటుగా వ్యోమగాములుగా విజయపథంలో దూసుకుపోతున్న తరుణంలో కూడా కొన్ని చోట్ల లింగ వివక్షత భేదాలు చూడటం విచారకరమన్నారు. లింగ సమానత్వం చూపినప్పుడే సమ సమాజ నిర్మాణానికి నాంది పలుకవచ్చని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అతిథులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్‌రావు, డాక్టర్ జి.సుధావాణి తదితరులు ఘనంగా సన్మానించారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం